

ప్రవేశ పరీక్ష ప్రశాంతం
సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 8లో▸



కళాకారులకు ఘన సన్మానం
కొడంగల్ పట్టణానికి చెందిన నరహరి వశిష్ఠ వర్ధంతిని పురస్కరించుకొని కళాకారులను ఘనంగా సన్మానించారు. 8లో▸



రైతుల అభ్యున్నతికి కృషి
రైతుల అభ్యున్నతికి వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం కృషి చేస్తున్నదని సొసైటీ డైరెక్టర్ కొండయ్య అన్నారు. 9లో▸



న్యూస్‌రీల్

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట్‌లో ఒకటవ తరగతిలో ప్రవేశం కోసం అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు వికారాబాద్ జిల్లాకు చెందిన వారై ఉండాలని, ఒక కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అవకాశం కల్పిస్తారన్నారు. మన జిల్లాకు రెండు సీట్లు కేటాయించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం1.50లక్షలు, పట్టణ ప్రాంతం వారికి రూ. 2లక్షల ఆదాయం మించరాదన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు 01జూన్ 2017 నుంచి 31 మే 2018 మధ్యలో జన్మించి వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో పొందాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలకు కులం, ఆదాయం, పుట్టిన తేదీ, ఆధార్ ధ్రువ పత్రాలను తజచేసి మే 1న సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 95738 59268 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్



మాతాశిశు ఆస్పత్రిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

తాండూరు టౌన్: అజాగ్రత్తగా ఉంటే అగ్గితో జీవితాలు బుగ్గిపాలవుతాయని తాండూరు ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ నాగార్జున అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక మాతా శిశు ఆస్పత్రిలో అగ్నిప్రమాదాల నివారణ, జాగ్రత్తలపై సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆస్పత్రిలో అకస్మాతుగా మంటలు చెలరేగినపుడు చేపట్టాల్సిన చర్యలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో జరిగే ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వంట పూర్తయిన తర్వాత గ్యాస్ ఆఫ్ చేయడం మరిచిపోరాదన్నారు. అలాగే ఇంట్లో వెలిగించే దీపాల వల్ల ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తుంటాయని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది జలంధర్, అమర్‌నాథ్ రెడ్డి, రఘుపతి రెడ్డి, రవి, కృష్ణారెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టండి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి

అనంతగిరి: వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అలా సాధ్యం కాని పక్షంలో తాత్కాలిక ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. ఆదివారం వికారాబాద్‌లోని టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా పదోన్నతులులేక అర్హులైన ఉపాధ్యాయులు నష్టపోతున్నారన్నారు. పాఠశాలల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నందున విద్యార్థులకు నష్టం జరుగుతోందన్నారు. పదోన్నతులు చేపడితేనే నియామకాల ఖాళీలపై స్పష్టత వస్తుందన్నారు. సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు ఖాతాల్లో జమచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు వెంటనే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, బాబురావు, పవన్, మల్లేశం, అరవింద్, , ఆయా మండలాల అధ్యక్షకార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేతల వర్గ పోరు.. అధికారుల బేజారు

కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్న చందంలా తయారైంది నాయకులు, అధికారుల మధ్య పరిస్థితి. అధికార నేతల మధ్య ఆధిపత్యపోరు అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. తాండూరులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిల మధ్య తలెత్తిన విభేదాలు అధికారులకు తలనొప్పిగా మారాయి. ఎలాగైనా బదిలీ చేసుకుని జిల్లా నుంచి వెళ్లిపోతే బాగుండని మెజార్టీ అధికారులు భావిస్తుండటం గమనార్హం.

డ్యూటీ చేయాలంటేనే జంకుతున్న అధికార గణం
- గ్రూపు రాజకీయాలపైనే నేతల ధ్యాస
- ఎవరికీ పట్టని ప్రజల గోస
- ఏళ్లు గడుస్తున్నా.. ఎక్కడి సమస్యలు అక్కడే



రథోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వర్గీయుల మధ్య తోపులాట

వికారాబాద్: సాధారణంగా అధికార, ప్రతిపక్షాల మధ్య నెలకొనే వైరాన్ని చూశాం. కానీ ప్రస్తుతం జిల్లాలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఇప్పటికే పలు సార్లు పట్నం.. పైలెట్ వర్గాల మధ్య అధికారులు నలిగిపోగా తాజాగా పరిస్థితి వికారాబాద్, పరిగి నియోజకవర్గాలకు సైతం పాకింది. వికారాబాద్‌లో ప్రధానంగా మున్సిపాలిటీలో ఎమ్మెల్యే వర్గం, మున్సిపల్ చైర్‌పర్సన్ వర్గాల మధ్య పచ్చి గడ్డి వేస్తే భగ్గుమనేలా పరిస్థితి తయారయ్యింది. మిగతా మండలాల్లోనూ కొందరు ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే వైరి వర్గంలో ఉండటంతో ఇరు వర్గాల మధ్య అధికారులు నలిగిపోతున్నారు. ఇక పరిగిలో ఇప్పటి వరకు బాగానే ఉండగా డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డితో విభేదించి ప్రత్యేక గ్రూపు కట్టారు. తాను సైతం ఎమ్మెల్యేగా పోటీకి సై అంటున్నారు. దీంతో అధికార యంత్రాంగంపై ఆధిపత్యం చేసే క్రమంలో వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

ఇటీవల చోటుచేసుకున్న పలు ఘటనలు..

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి సీఐ రాజేందర్‌రెడ్డిపై దుర్భాషలాడిన ఆడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో అధికారులు ఎంతగా ఇబ్బంది పడుతున్నారనే విషయం మరోసారి కళ్లకు కట్టినట్లయ్యింది. యాలాలలో నిర్వహించిన క్రీడల సమయంలో తలెత్తిన ప్రోటోకాల్ రగడతో ఎంపీడీఓ, డీఈఓ, టీచర్లు, ఎంఈఓ ఇలా అందరూ నలిగిపోయారు. ఇక జిల్లాలో పంచాయతీ కార్యదర్శులతో బంతి ఆట ఆడుకుంటున్నారు. అధికార పక్షంలో ఒకరు ఆ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ఫోన్ చేస్తే ఇంకొకరు అతన్ని ముట్టుకోవద్దు అని కాల్ చేయడం ఇటీవల సర్వసాధారణమైంది. జాతర ఉత్సవాల్లో తనను తన వర్గం నాయకులను వెనకాల కూర్చోబెట్టి ఎమ్మెల్యే అతని వర్గాన్ని ముందు వరుసలో కూర్చోబెట్టారనే అక్కసుతో ఎమ్మెల్సీ సీఐని దూర్భాషలాడటం.. ఆ ఆడియో వైరల్‌గా మారటం ఇద్దరి మధ్య నలుగుతున్న అధికారుల దయనీయ స్థితికి అద్దం పట్టింది. గతంలో ఆర్డీఓను సైతం ఇలాగే దుర్భాషలాడారనేది చర్చ జరుగుతుంది. ఉన్నత స్థాయి అధికారులే కాకుండా పంచాయతీ కార్యదర్శులు , వీఆర్వోలు మొదలు గ్రూప్ టూ, గ్రూప్ వన్ అధికారులు, జిల్లా స్థాయి అధికారుల వరకు ఇరువర్గాల నేతల మధ్య నిత్యం ఏదో ఒక విషయంలో నలగక తప్పటంలేదు.

అభివృద్ధికి ఆటంకం

నేతల మధ్య వైరం అభివృద్ధికి ఆటంకంగా మారుతోంది. నాయకులు అభివృద్ధిని వదిలేసి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేయడానికే పరిమితమయ్యారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరి వర్గం నుంచి మరో వర్గంలోకి నాయకులను చేర్చుకోవటం.. లాంటి వాటిపై అధికార పార్టీ నేతలు దృష్టి సారిస్తున్నారు. అధికార పార్టీ నుంచి ముఖ్య నేతలు ప్రాతినిథ్యం వహిస్తున్న తాండూరులో ప్రజల నుంచి ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. అది రోడ్ల పైకి వచ్చి నిరసనలు, రాస్తా రోకోలు చేసే స్థాయికి చేరుకుంది. వందల కోట్లు మంజూరయ్యాయని నేతలు, ఎమ్మెల్యేలు హడావుడి చేయటం తప్ప ఎక్కడా కూడా ఆ పనులు ప్రారంభం కావపోవడం గమనార్హం. జిల్లాలో ఎక్కడ చూసినా రోడ్లు దుమ్ము రేగుతున్నాయి. వాటిపై దృష్టి సారించటం మానేసి ప్రజా ప్రతినిధులు గ్రూపులను పెంచి పోషించడం పైనే సమయం వెచ్చిస్తున్నారనే ఆరోపనలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్‌లో గెలిచిన కొద్ది రోజులకే పైలెట్ కారెక్కడంతోనే తాండూరు బీఆర్‌ఎస్‌లో గ్రూపు తగాదాలకు తెరలేచింది. ఇక గ్రూపు తగాదాలు జిల్లా అంతటా పాకటంతో వారి గొడవలు ఎలా ఉన్నా అధికార యంత్రాంగం మాత్రం వారి

భద్రేశ్వర స్వామి సాక్షిగా..

తాండూరు: భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలోనూ నేతల ఆధిపత్యపోరు కొనసాగింది. ఈ క్రమంలో శనివారం రాత్రి నిర్వహించిన రథోత్సవ కార్యక్రమంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది మాదిరిగానే ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గీయుల మధ్య వాగ్వాదం జరిగి తోపులాటకు దారి తీసింది. దశాబ్దాల కాలంగా భద్రేశ్వర స్వామి రథోత్సవాలకు తాండూరు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీలకు చెందిన నియోజకవర్గ నాయకులను ఉత్సవాలకు ఆహ్వానిస్తారు. అందులో భాగంగా ఆయా పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరవుతూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేలా సహకరిస్తూ వచ్చారు. అయితే రెండేళ్లుగా బీఆర్‌ఎస్ పార్టీలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలు రెండు వర్గాలుగా మారారు. ఇరువురి నేతలు ఉత్సవాలకు హాజరై వేర్వేరుగా స్వామి వారిని దర్శించుకుని రథం వద్దకు వచ్చారు. రథం ఎదుట ప్రజా ప్రతినిధులకు వేసిన తివాచీపై కూర్చునే విషయంలో గొడవ జరిగింది. ముందు వరుసలో కూర్చునే విషయంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఊహించని సంఘటనతో పోలీసులు అలర్ట్ అయ్యారు. గొడవలు సృష్టించేందుకు కారకులైన వారిని అక్కడి నుంచి పక్కకు తీసుకెళ్లారు. డీఎస్పీ శేఖర్‌గౌడ్ చొరవతో 10 నిమిషాల వ్యవధిలోనే ప్రశాంతమైన వాతావరణం నెలకొంది. అనంతరం రథోత్సవ వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. అయితే ఇరు వర్గాల గొడవతో కాంగ్రెస్, బీజేపీ, నాయకులు రథోత్సవం నుంచి పక్కకు వచ్చారు. మరో వైపు బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రధ్ పటేల్ సైతం తోపులాట జరుగుతున్న ప్రదేశం నుంచి పక్కకు వచ్చి ఉత్సవాలను తిలకించారు.



ఆత్మీయ సమ్మేళనంలో డోలు కొడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

పాలమూరుతో సస్యశ్యామలమే

- త్వరగా ఎత్తిపోతలను పూర్తిచేస్తాం
- ఎంపీ రంజిత్‌రెడ్డి స్పష్టీకరణ
- వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- పెద్దేముల్‌లో ఆత్మీయ సమ్మేళనం

పెద్దేముల్: పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేసి తాండూరును సస్యశ్యామలం చేస్తామని ఎంపీ రంజిత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పెద్దేముల్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ పాలమూరు– రంగారెడ్డి పూర్తి అయితే లక్షా 10వేల ఎకరాలకు నీరు అందుతుందన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. సీఎం కేసీఆర్‌ను ఒప్పించి తాండూరు ప్రాంత అభివృద్ధికి అధిక నిధులు తీసుకొచ్చిన ఘనత రోహిత్‌రెడ్డికే దక్కిందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో తాండూరు ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎంపీ అన్నారు.

50వేల మెజార్టీ ఖాయం

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా 50వేల మెజార్టీతో తాండూరులో గెలవడం ఖాయమని, నేను పక్కా లోకల్ అని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. 50 ఏళ్ల పాలనలో జరగని అభివృద్ధి నాలుగేళ్లలో చేసి చూపించానన్నారు. గత ఉమ్మడి రాష్ట్రంలో రైతులకు కరెంటు కష్టాలు, పంటలకు మద్దతు ధర, అమ్ముకోడానికి కేంద్రాలు లేక, పెట్టుబడులు అందక నానా ఇబ్బందులు పడేవారన్నారు. కేసీఆర్ పాలనలో 24గంటల ఉచిత కరెంటుతో పాటు రైతు బీమా, రైతు బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. సీఎం చొరవతో తాండూరు ప్రాంత అభివృద్ధికి రూ.134 కోట్ల ప్రత్యేక ప్రత్యేక నిధులు తీసుకువచ్చామన్నారు. ఈ నిధుల నుంచి ప్రతి గ్రామ పంచాయతీకి రూ.50లక్షల చొప్పున అభివృద్ధి పనులకు కేటాయిస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులు, ఎంపీ రంజితన్న ఆశీర్వాదంతో తాండూరు రూపురేఖలు మారుస్తానన్నారు.

మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..

తాండూరు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతంగా జరుగుతున్నాయని విద్యా మౌలిక సదుపాయాల సంస్థ మాజీ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి అన్నారు. మళ్లీ కేసీఆర్ రాజ్యం రాబోతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, ఎంపీపీ అనురాధ, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఎంపీటీసీ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్‌చారి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ధారూర్ మండల ఎబ్బనూర్ గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే రూ.20వేల చొప్పున, గాయపడిన వారికి రూ.10వేల చొప్పున చెక్కులు అందచేశారు.

చక్రపాణికి గోల్డెన్ గార్డెన్ అవార్డు

అనంతగిరి: జిల్లా హార్టికల్చర్ అధికారి చక్రపాణి రాష్ట్ర స్థాయిలో అందించే గోల్డెన్ గార్డెన్ అవార్డు అందుకున్నారు. కలెక్టరేట్ ఆవరణలో సుందరంగా గార్డెన్ ఏర్పాటు చేసినందుకు గుర్తింపుగా ఈ అవార్డు అందజేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన 7వ గార్డెన్ ఫెస్టివల్‌లో ఈ అవార్డును మంత్రి నిరంజన్‌రెడ్డి, హార్టికల్చర్ డైరెక్టర్ హన్మంత్‌రావు, ఎమ్మెల్సీ, రైతుబంధు చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.



మంత్రి నిరంజన్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న జిల్లా ఉద్యాన అధికారి చక్రపాణి

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



వికారాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకుల నిరసన

అనంతగిరి: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు అనిల్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు డిమాండ్ చేశారు. ఆదివారం టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో పట్టణంలోని గ్రంథాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ అనే కొత్త పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చి ఉద్యోగుల్లో భద్రత లేకుండా చేశారన్నారు. పాత పెన్షన్‌ను ప్రారంభించి ఉద్యోగ, ఉపాధ్యాయ జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ ప్రతినిధులు విజయేందర్, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ జోడెడ్ల ధర రూ.2లక్షలు

పక్క చిత్రంలో కనిపిస్తున్న జోడెడ్లకు అక్షరాలా రూ.2లక్షల ధర పలికింది. భావిగి భద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆదివారం పశు ప్రదర్శన ప్రారంభించింది. ఈ ప్రదర్శనలో జిల్లాతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, వివిధ ప్రాంతాలకు చెందిన జోడెద్లు వచ్చాయి. మూడేళ్ల క్రితం వరకు జోడెద్దులు రూ.లక్ష నుంచి రూ. 1.25 లక్షల వరకు పలికాయి. అయితే ఈ సారి నిర్వహించిన పశు ప్రదర్శనలో జోడెడ్ల జత రూ.2లక్షల వరకు పలకడం గమనార్హం. కర్ణాటకకు చెందిన రైతు వీటిని కొనుగోలు చేశారు. – తాండూరు



ఐక్యంగా ఉంటేనే మనుగడ సాధ్యం



ట్రస్మా జిల్లా కమిటీ సభ్యులు

ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి

వికారాబాద్ అర్బన్: ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ఐక్యంగా ఉంటేనే మనుగడ సాధ్యమని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు పాపిరెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్‌లో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనాతో ప్రైవేటు పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. రెండేళ్ల పాటు ప్రైవేటు పాఠశాలలకు తీవ్ర ఆర్థిక నష్టం జరిగినట్లు తెలిపారు. అయినప్పటికీ ఫీజులు చెల్లించకపోయినా విద్యను బోధించినట్లు తెలిపారు. చిన్నచిన్న ప్రైవేటు పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. అనంతరం ట్రస్మా రాష్ట్ర కోర్‌కమిటీ సభ్యులు ఎం. నాగయ్య ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్. వెంకట్ రెడ్డి వికారాబాద్, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్ కుమార్, వికారాబాద్ పట్టణ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు.

దేశం చూపు తెలంగాణ వైపు

- ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి
- వ్యవసాయ రంగానికి సీఎం పెద్దపీట
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి, చిత్రంలో ఎమ్మెల్సీ, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

షాబాద్: దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ నుంచి పామెన వరకు రూ. 5 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులకు జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. రూ.లక్షల కోట్ల అప్పుతెచ్చిన బీజేపీ ఏం అభివృద్ధి చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. ప్రతి ఇంటికీ నీటిని ఇచ్చిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని తెలిపారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా వ్యవసాయ రంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వంపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేసే విమర్శలను ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీకి చెందిన నాయకులను నిలదీయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, మొయినాబాద్ జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, జిల్లా లీగల్ అడ్వైజర్ పీసరి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం

మొయినాబాద్‌రూరల్: అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు సాగుతున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి బాకారం వరకు రూ.1.30 కోట్లతో చేపట్టిన డబుల్ రోడ్డు పనులకు, రూ.5 కోట్లతో చిన్న మంగళారం మూసీ వాగుపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపనలతోపాటు రూ.5 కోట్లతో నక్కలపల్లి ఈసీ వాగుపై చేపట్టిన వంతెన నిర్మాణానికి ఎంపీ రంజిత్ రెడ్డి తదితరులతో కలిసి భూమిపూజ చేశారు.

క్లుప్తంగా

రేవంత్‌ను కలిసిన రఘువీరారెడ్డి



ధారూరు: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి ఆదివారం కలిశారు. అంతారం గ్రామానికి చెందిన రఘు.. నగరంలోని ఎల్‌బీ నగర్ హాత్‌సే హాత్ జోడో కార్యక్రమం ఇన్‌చార్జిగా కొనసాగుతున్న నేపథ్యంలో రేవంత్‌ను ఆయన నివాసంలో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ జోడో కార్యక్రమం గురించి పలు విషయాలను రేవంత్ రఘుని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో ముమ్మరంగా కార్యక్రమాలు చేపట్టాలని, పార్టీ బలోపేతం కోసం ఆయన పలు సూచనలు చేశారని, పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్న పట్లోళ్లను రేవంత్ అభినందించినట్లు సమాచారం.

ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు

హాజరైన ఎంపీ రంజిత్‌రెడ్డి



ముస్లింలతో కలసి ప్రార్థనలు చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

తాండూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి చెవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం రంజాన్ ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలతో కలిసి ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఇఫ్తార్ విందుకు వందలాది మంది ముస్లింలు హాజరయ్యారు.

పిడుగు పాటుకు చెట్టుపై మంటలు

వికారాబాద్ అర్బన్: ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆదివారం సాయంత్రం 4గంటల సమయంలో వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లి శ్రీ సాయినగర్‌లో ఒక ఈత చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. స్థానికులు ఈ దృశ్యాన్ని గమనించి వీడియోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. పిడుగు పాటు అనంతరం వర్షం పడటంతో పంటలు ఆరిపోయాయి.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాచారం: సాగర్ రోడ్డులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రమైన మాడ్గుల్‌కు చెందిన సాయికృష్ణ తన ట్రాక్టర్‌లో ఇసుకను శనివారం రాత్రి యాచారం వైపు తరలిస్తున్నాడు. పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి యాచారం స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

కారు బోల్తా ఒకరి మృతి

చేవెళ్ల: కారు అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం అక్నాపూర్ గ్రామానికి చెందిన బీ రమేశ్(35) అతని స్నేహితుడు ఎల్ శ్రీకాంత్ మరో ఇద్దరు స్నేహితులు కారులో షాబాద్ మండలంలో స్నేహితుని ఇంటికి వచ్చారు. రాత్రి దావత్ ముగించుకొని తిరుగు ప్రయాణంలో చేవెళ్ల మండలం పామెన బస్ స్టేజికి సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులోని రమేశ్ అక్కడికక్కడే మృతి చెందగా శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్నేహితులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాచారం: నాగార్జున సాగర్ – హైదరాబాద్ రహదారిపై వాహనం ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని చంపాపేటకు చెందిన అక్షయ్ కుమార్(25) దుర్గాప్రసాద్ ఆదివారం ఉదయం బైక్‌పై మాల్ మార్కెట్‌కు వెళ్లి మధ్యాహ్నం నగరానికి బయలుదేరారు. సాగర్ రోడ్డుపై తక్కళ్లపల్లి గేట్ వద్ద యాచారం నుంచి మాల్ వైపు వెళ్తున్న వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో అక్షయ్‌కుమార్, దుర్గాప్రసాద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో నగరానికి తరలిస్తుండగా మార్గ మధ్యలో అక్షయ్‌కుమార్ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగయ్య తెలిపారు.

గ్రామాలు బాగుంటేనే రాష్ట్రం సుభిక్షం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి

- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- కొడంగల్‌కు రాని రేవంత్ కావాలో.. ఎప్పుడూ అందుబాటులో ఉండే నేను కావాలో ఆలోచించాలి: ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- రుద్రారంలో ఆత్మీయ సమ్మేళనం

కొడంగల్: గ్రామాలు బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని.. రాష్ట్రం బాగుంటేనే దేశం బాగుంటుందని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని రుద్రారంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 15 గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ తెలంగాణలో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు మేలు చేస్తున్నారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పది సీట్లు కూడా రావన్నారు. అలాంటి పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి కొడంగల్ నుంచి పోటీ చేసే అవకాశం ఉన్నందున ఆయన కావాలో.. 24 గంటలు అందుబాటులో ఉండే నేను కావాలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఎప్పుడు పిలిచినా మీ ఊరికి, మీ గల్లీకి, మీ ఇంటికి వస్తున్నానని నరేందర్‌రెడ్డి అన్నారు. కొడంగల్‌కే రాని రేవంత్ మీ సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామాలకు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందాయన్నారు. దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు ఇస్తున్నట్లు చెప్పారు. ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్టు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతు బంధు, రుణ మాఫీ, రైతు బీమా, ఉచిత విద్యుత్ తదితర పథకాల వల్ల ఎంతో మందికి లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రుద్రారం గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్తులు కోరారు. పాటిమీదిపల్లి గ్రామానికి బీటీ రోడ్డు, డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో రుద్రారం సర్పంచ్ వెంకటలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు వెంకట్‌రెడ్డి, గోవింద్, అనిత, శంకర్‌నాయక్, గుండప్ప, అంజద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం కృష్ణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఆర్ బస్వరాజ్, బీఆర్‌ఎస్ నాయకులు జీ రాంరెడ్డి, వెంకటయ్య గౌడ్, న్యాయవాది నర్సింలు, సిద్ధి లింగప్ప, భీములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ‘పల్లెబాట’

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: పల్లెబాట కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సయ్యాద్‌పల్లి, తొండుపల్లి, రావులపల్లి, రాఘవపూర్ గ్రామాల్లో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వీధి వీధి తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమస్యలు ఉన్న గ్రామానికి ప్రత్యేక నిధులను కేటాయించి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. పల్లెబాట ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయా లేదా తెలుసుకున్నామన్నారు. పేదల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రైతు బంధు, రైతు బీమా పథకాలు దేశానికే ఆదర్శ మన్నారు. ఇలా ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, రాఘవపూర్ సర్పంచ్ జగన్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, రైతు బంధు అధ్యక్షుడు రాజేందర్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



తొండుపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కళాకారులకు ఘన సన్మానం



కళాకారులతో మురహరి వశిష్ఠ కుటుంబం

కొడంగల్ రూరల్: పట్టణానికి చెందిన నరహరి వశిష్ఠ ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం రాత్రి కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాలకు చెందిన భజన మండలి, ఆధ్యాత్మిక గురువులను ఘనంగా సన్మానించారు. పట్టణంలోని కేశవ స్వామి ఆలయంలో స్థానిక ఆలయాల భజన మండలి సభ్యులు, రేగడిమైలారం, కర్ణాటకలోని విఠలాపూర్ తదితర గ్రామాల ఆధ్యాత్మిక గురువులు, భజన మండలికి చెందిన 70మందికి పైగా సభ్యులను నరహరి వశిష్ఠ కుమారులు శ్రీహరి, మురహరి, హరిప్రసాద్, మనుమండ్లు అభిలాష్ రెడ్డి, భవాని కృష్ణ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడైన తమ తండ్రి కళాభిమాని కావడం, శారదా లలిత కళా నికేతన్ అధ్యక్షుడిగా, భజనలు, జానపద కళలు అంటే అభిమానం ఉండడంతో ఆయన జ్ఞాపకార్థం ప్రతి ఏటా వర్ధంతి రోజు కళాకారులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు మాట్లాడుతూ.. అంతరించిపోతున్న కళలకు జీవం పోస్తూ ప్రోత్సహించడం హర్షణీయమన్నారు. అంతకుముందు ఆలయంలో అర్చకులు అక్కి శ్రీనివాసమూర్తి స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పీ రాంరెడ్డి, కే లక్ష్మీనారాయణ, దామోదర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు కే శివకుమార్, కే వెంకటేష్, నాగేష్‌కుమార్, డాక్టర్ నాగిరెడ్డి, ఎల్ వెంకటేష్, విశ్రాంత జీహెచ్ఎం శీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



కొడంగల్ రూరల్: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



వికారాబాద్‌లోని కొత్తగడి రెసిడెన్షియల్ స్కూల్ వద్ద విద్యార్థులు

అనంతగిరి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 6,7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం జరిగిన బీఎస్‌వీ సెట్ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 13 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష జరిగింది. మొత్తం 5,251మంది విద్యార్థులకు గాను 4,499మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని గురుకుల ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ శారద తెలిపారు.

కుల్కచర్ల మండలంలో..

కుల్కచర్ల: మండలంలోని ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్‌లో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 6వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహించగా.. 241 మంది గాను 205 మంది విద్యార్థులు హాజరయ్యారు. 7నుంచి 9వ తరగతి వరకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 151మందికి గాను 132మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి తెలిపారు.

గిరిజన గురుకులంలో..

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని పాత కొడంగల్ సమీపంలో గల గిరిజన గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం జరిగిన పరీక్షకు ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 368 మంది హాజరు కావాల్సి ఉండగా 30మంది గైర్హాజరైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు.

సూదిమందు వికటించి వ్యక్తికి అస్వస్థత

దోమ: సూదిమందు వికటించి వ్యక్తి అస్వస్థతకు గురైన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాలు.. ఐనాపూర్‌కు చెందిన ఆశన్న జ్వరంతో బాధపడుతూ మండల కేంద్రంలోని ఆర్‌ఎంపీ వైద్యుడి క్లినిక్‌కు వచ్చాడు. అక్కడ వైద్య పరీక్ష చేసిన ఆర్‌ఎంపీ రోగికి ఇంజెక్షన్ ఇచ్చాడు. కొద్ది సేపటికే ఆ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పరిగిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ఆశన్నను పరీక్షించి బీపీ డౌన్ కావడం వల్ల ఇలా జరిగిందని తెలిపారు. రోగి మద్యం మత్తులో ఉండగా ఇంజెక్షన్ ఇవ్వడంతో ఇలా జరిగిందని, ప్రస్తుతం ఆశన్న పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. రోగి పరిస్థితి తెలియకుండా ఆర్‌ఎంపీ ఇంజెక్షన్ ఇవ్వడంపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత క్లినిక్‌పై దృష్టి సారించాలని వారు కోరారు.



ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆశన్న

కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పర్వతాలు

షాద్‌నగర్: కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు ఆరోపించారు. మోదీకి హటావో.. దేశ్‌కి బచావో కార్యక్రమానికి సంబంధించి వాల్ పోస్టర్‌లను ఆదివారం షాద్‌నగర్ పట్టణంలో సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ కంపెనీలను ప్రైవేటు పరం చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని అన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తీసుకొస్తోందని మండిపడ్డారు. అదేవిధంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన కేంద్రం ఈ రంగాన్ని కూడా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందని అన్నారు. మోదీ అనుసరిస్తున్న విధానాలు దేశ ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అదే విధంగా దేశంలో దళిత, గిరిజన, మైనార్టీల పైన రోజు రోజుకూ దాడులు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను నాయక్, గోవింద్ నాయక్, షకీల్, గడ్డం జంగయ్య, చంద్రబాబు, రమేష్, మహ్మద్ హుస్సేన్, విఠల్ యాదవ్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఆలయ భూములు రైతులకే దక్కాలి

టీఎస్‌ఐఐసీ తీసుకుంటే ఊరుకోం

- కౌలు రైతులకు అండగా ఉంటాం
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వర ఆలయ భూములు కౌలు రైతులకే దక్కాలని, టీఎస్‌ఐఐసీ తీసుకుంటే ఊరుకునేది లేదని, రైతులకు మద్దతుగా పోరాటం చేస్తామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బీ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓంకారేశ్వర ఆలయానికి చెందిన 1,400 ఎకరాల భూముల్లో నందివనపర్తి, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 600 మందికి పైగా రైతులు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. సాగులో ఉన్న రైతులకు కౌలుదారు చట్టం ప్రకారం 1950లోనే 37 ఏ సర్టిఫికెట్లు ఇచ్చారని తెలిపారు. 38ఈ ఇవ్వకుండా సర్కార్ అడ్డుకుందని అన్నారు. కౌలు దారుల చట్టం ప్రకారం ఆ భూములపై హక్కులు కౌలు రైతులకే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ భూముల విషయంలో స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్‌ఐఐసీ పేరుతో ఆలయ భూములను సేకరించి ఫార్మాసిటీకి కట్టబెట్టాలని సర్కార్ చూస్తోందని ఆయన ఆరోపించారు. నందివనపర్తి, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో కౌలు రైతులకే ఆ భూములు చెందాలని, ఫార్మాసిటీకి ఆలయ భూములు తీసుకోవద్దని పంచాయతీల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పీ అంజయ్య పాల్గొన్నారు.

హద్దులు దాటితే క్రిమినల్ కేసులు

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స చేసి రోగులు, క్షతగాత్రులను ఆస్పత్రులకు రెఫర్ చేయాలని అలా కాకుండా వైద్యం చేస్తే చర్యలు తప్పవని ఎస్పీ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆర్‌ఎంపీలు రోగులకు నేరుగా వైద్యం చేస్తున్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ప్రజలు కూడా ప్రథమ చికిత్సకు మాత్రమే ఆర్‌ఎంపీల వద్దకు వెళ్లాలని సూచించారు. నకిలీ వైద్యుల సమాచారాన్ని, అలాగే ప్రథమ చికిత్స కాకుండా పూర్తి స్థాయి వైద్య సేవలు అందించే ఆర్‌ఎంపీల సమాచారం పోలీసులకు తెలియజేయాలని, లేకుంటే డయల్ 100కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

మీర్‌పేట్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయిన సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఉదయ్ భాస్కర్ కథనం మేరకు.. బాలాపూర్ మండలం డీఎన్‌ఆర్ కాలనీకి చెందిన ఎం లాలునాయక్(43) ఆటో నడపుతు జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్నేహితుల వద్ద ఉన్నానని వస్తానని చెప్పాడు. తర్వాత ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. లాలునాయక్ ఆచూకీ తెలిసి వారు 9490617342, 9505588744 సెల్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

108లో ప్రసవం

ఇబ్రహీంపట్నం రూరల్: గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో 108 సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రసవించింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోల్కంపల్లికి చెందిన కల్యాణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి కాల్ చేశారు. పది నిమిషాల్లో 108 సిబ్బంది కల్యాణి ఇంటికి చేరుకుంది. అప్పటికే నొప్పులు ఎక్కువ కావడంతో 108లోనే పురుడు పోశారు. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ భాస్కర్, పైలెట్ శ్రీరామ్ తల్లి, బిడ్డను ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చేర్పించారు. 108 సిబ్బందిని వైద్యులు అభినందించారు.

ప్రజల పక్షాన నిరంతర పోరాటం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి

పరిగి: ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. ఆదివారం పొల్కంపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఒంటెత్తు పోకడలతో ప్రజలు విసుగు చెందారని పేర్కొన్నారు. ప్రజల పక్షాన తమ పార్టీ ఎల్లప్పుడూ పోరాటం చేస్తూనే ఉంటుందని తెలిపారు. సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడి ప్రజలకు న్యాయం చేస్తున్న పార్టీ ఏదైనా ఉందంటే అది బీజేపీనేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతోందని, సీఎం కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోపిడీ చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, కానీ సొమ్ము ఒకరిది.. సోకు ఒకరిది అన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండి, వారి సమస్యలపై పోరాటం చేయాలని, కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న బీజేపీ నేతలు

రూ. 100కోట్లతో తండాల అభివృద్ధి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజా సేవకే తన జీవితం అంకితమన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలు, పల్లెల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. నియోజవర్గంలో తండాల అభివృద్ధికి రూ.100 కోట్లతో కార్యచరణ ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. కొత్తగా ఏర్పడిన 54 పంచాయతీల్లో నూతన భవన నిర్మాణాలకు రూ. 10.40 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అలాగే బీటీ రోడ్లకు రూ. 36కోట్లు, ఆమనగల్లులో గిరిజన భవన నిర్మాణానికి రూ. 2కోట్లు విడుదలైనట్లు చెప్పారు. సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 13.29 కోట్లు మంజూరు కావడం జరిగిందన్నారు. ఇతర పంచాయతీల్లో భవనాల నిర్మాణానికి రూ. 16.60 కోట్లు, నియోజకవర్గంలో 37 పల్లె దవాఖానలు మంజూరు కాగా, ఒక్కో దవాఖాన నిర్మాణానికి రూ. 20 లక్షల చొప్పున మంజూరయ్యాయని, త్వరలో వాటిని ప్రారంభిస్తామని చెప్పారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో 108 పాఠశాలల్లో రూ. 69 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల రెన్యూవల్‌కి రూ. 20 కోట్లు, పంచాయతీ రోడ్ల రెన్యూవల్‌కి రూ.25 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. కడ్తాల్ మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో భవన నిర్మాణానికి రూ. 50లక్షలు, మహిళా సమాఖ్య భవనానికి రూ. 20లక్షలు, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి రూ.1.50 కోట్లు, తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి రూ.1.18 కోట్లు, కేజీబీవీ భవన నిర్మాణానికి రూ.3.10 కోట్ల మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని వివరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

పాఠశాల స్థలం కాపాడాలని ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేటలో బధిరుల పాఠశాలకు చెందిన భూమిని ఆక్రమించేందుకు కొందరు యత్నిస్తున్నారని, ఆ భూమిని కాపాడాలని పాఠశాల నిర్వాహకులు ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు పాఠశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ నిర్వాహకులు మాట్లాడుతూ.. పాఠశాలకు చెందిన 16 ఎకరాల స్థలాన్ని ఇటీవల కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించేందుకు వచ్చారని, తాము అడ్డుకోవడంతో వెళ్లిపోయారని తెలిపారు. తిరిగి భూమిని ఆక్రమించేందుకు వస్తున్నారని తెలిపారు. పాఠశాల భూమి కబ్జాకు గురికాకుండా చూడాలని పోలీసులను కోరినట్లు స్కూల్ నిర్వాహకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఐపీ ఉమ్మర్ ఖాన్, చంద్రప్రియ, స్కూల్ ఇంచార్జ్ శ్రీ రమేష్ తెలిపారు.